ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఏర్పాటు

ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ నూతన కమిటీ సభ్యులు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు) స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం సమావేశమయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జి.ధనలక్ష్మి, కార్యదర్శిగా పి.రమాదేవి. నిర్వాహక సహాయ కార్యదర్శిగా పద్మ, ఉపాధ్యక్షులుగా శారద, అనురాధ, రఘుపతి, సహాయ కార్యదర్శులుగా అన్నపూర్ణ, భద్రమ్మ, కోశాధికారిగా మాధవి, వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఆదిలక్ష్మి, సుజాత, మణి, సావిత్రి, రాజేశ్వరి, నిర్మల ఎన్నికయ్యారు.

'చిట్టీలు వేశా.. నట్టేట మునిగా'

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 5: చిట్టీలు వేసి.. నట్టేట మునిగానని పాల్వంచకు చెందిన నంబూరి వెంకటనారాయణ వాపోయారు. ఆయన శనివారం కొత్తగూడెంలోని ఓ హోటల్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొత్తగూడెంలోని ఎస్‌సీఎఫ్‌సీ చిట్‌ఫండ్‌లో తాను మూడు చిట్టీలు (రూ.కోటి, రూ.50 లక్షలు, రూ.25 లక్షలు) వేసినట్లు చెప్పారు. రూ.50 లక్షల చిట్టీని పాడుకున్నానని అన్నారు. ఆ సమయంలో తనతో అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకున్నారని చెప్పారు. తాను పెద్దగా చదువుకోలేదని, ఆ అగ్రిమెంట్‌ను చదవలేదని, వారు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టానని అన్నారు. తాను రూ.25 లక్షల చిట్టీ పాడుకోకపోయినా పాడుకున్నట్లుగా ఆ పత్రాల్లో పొందుపరిచి మోసగించారని వాపోయారు. ఈ మోసాన్ని భరించలేని తన భార్య.. గత ఏడాది అక్టోబర్‌లో ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చండ్రుగొండ, ఏప్రిల్ 5: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరికరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. దమ్మపేట మండలం ముత్తాయిగూడెం గ్రామస్తుడు దారబోయిన హరిబాబు(26), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు పట్టణానికి చెందిన తన సమీప బంధువు శెట్టిపల్లి నరసింహారావు బైక్‌పై ఆయనతో కలిసి సుజాతనగర్ నుంచి శనివారం చండ్రుగొండకు ప్రయాణిస్తున్నారు. తిప్పనపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్‌ను, సింగరేణి సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ నుంచి కొత్తగూడెం వైపు వేగంగా వెళ్తున్న బొగ్గు టిప్పర్ ఢీకొంది. దారబోయిన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. శెట్టిపల్లి నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు హరిబాబుకు భార్య జ్యోతి, పది నెలల వయసున్న కుమారుడు ఉన్నారు. ప్రమాద స్థలాన్ని ఏఎస్సై పాపారావు పరిశీలించారు. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. హరిబాబు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఇల్లెందు, ఏప్రిల్ 5: ఇల్లెందులోని 14వ నెంబర్ బస్తీకి చెందిన కూరగాయల వ్యాపారి మిస్సింగ్ అయినట్లు ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన ఘటన చోటు చేసుకున్నది. ఇల్లెందు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 14వ నెంబర్ బస్తీకి చెందిన పవన్‌లోద్ ఇల్లెందు కూరగాయల మార్కెట్‌లో ఉన్న షాపులో భార్య బాబితలోద్‌తో కలిసి షాపు నిర్వహిస్తున్నాడు. పవన్‌లోద్ 3వతేదీ సాయంత్రం 5గంటలకు షాపు నుంచి బయటకు వెళ్ళి శనివారం సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. భార్య బాబిత లోద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

నేడు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలం, ఏప్రిల్ 5: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఆదివారం భక్తులకు పెరుగన్నం, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట దేవదానం, పూసల శ్రీనివాసచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మారండి.. మంచిరోజులు వస్తాయి..!

మావోయిస్టులకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచన

పోలీసుల ఎదుట 86మంది లొంగుబాటు

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఐజీ చంద్ర శేఖర్‌రెడ్డి, పక్కన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 5 : సమాజాభివృద్ధి కోసం మావోయిస్టులు మారాలని, సన్మార్గాన్ని ఎంచుకుని జనజీవన స్రవంతిలోకి వస్తే మంచిరోజులు వస్తాయని తెలంగాణ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట మావోయిస్టు పార్టీకి చెందిన 86మంది సభ్యులు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు అధ్యక్షతన హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఐజీ వెల్లడించారు. మావోయిస్టుల్లో మార్పు తీసుకురావడం, ఏజెన్సీ ప్రజల్లో చైతన్యాన్ని నింపేందుకు పోలీసులు చేపడుతున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నదని ఐజీ అన్నారు. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కి చెందిన 86మంది మావోయిస్టు పార్టీ సభ్యులు భద్రాద్రి, ములుగు జిల్లాల పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ 141, 81వ బెటాలియన్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్న మావోయిస్టులు లొంగిపోతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయిన వారిలో ఒక ఏరియా కమిటీ సభ్యుడు, ముగ్గురు పార్టీ సభ్యులు, 27మంది మిలీషియా సభ్యులు, 8మంది కమిటీ సభ్యులు, 20మంది దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్(డీఏకేఎంఎస్), కేఎంఎస్ సభ్యులు, 13మంది చైతన్య నాట్యమండలి(సీఎన్‌ఎం) సభ్యులు, 9మంది గ్రామ రక్షక దళం సభ్యులు, ములుగు జిల్లా పోలీస్ అధికారుల ఎదుట ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు, ఒక పార్టీ సభ్యుడు, ఒక మిలీషియా సభ్యుడు మొత్తం 86మంది ఉన్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో 85మంది బీజాపూర్ జిల్లాకు చెందిన వారు కాగా ఒకరు సుక్మా జిల్లాకి చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరిలో 20మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కొక్కరికీ రూ.25 వేలు ప్రోత్సాహక నగదుని అందజేయడం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 224మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 95మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. సమావేశంలో ములుగు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి కొట్టె రుత్విక్ సాయి, సీఆర్‌పీఎఫ్ 141వ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్లు కమల్ వీర్, ప్రీత, 81వ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ హిమాన్షు, చర్ల సీఐ ఆలెం రాజు వర్మ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

శాంతియుత భారత్ నిర్మాణమే లక్ష్యం

కేంద్రహోంశాఖా మంత్రి అమిషా

శాంతియుత భారత్‌ను నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంశాఖా మంత్రి అమిషా అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత దంతేవాడ జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన మావోయిస్టు పార్టీని ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి నెల చివరివారంలోపు శాంతి సుస్థిరత కోసం మావోయిస్టుర హిత దేశాన్ని నిర్మించడమే లక్ష్యమన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి ఇక జనజీవన స్రవంతిలోకి రావాలన్నారు. రాష్ట్రంలో బాంబుల మోతకు, తుపాకుల తుటాలకు స్వస్తి పలకాలన్నారు. ఇప్పటికే మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై ఏర్పడిన అపనమ్మకంతో ఆ పార్టీ సభ్యులంతో జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని, మావోయిస్టురహిత గ్రామాలకు రూ.కోటి నిధులను కేంద్రం ఇస్తుందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి పాటుపడాలన్నారు.

భద్రాచలం: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పీవో, అధికారులు, మణుగూరు టౌన్: నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, అశ్వారావుపేట టౌన్‌లో..

పాల్వంచ: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీపీఎస్ సీఈ, ఇంజినీర్లు

జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరాలకు ఆదర్శం

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకను శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో రాహుల్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించా రు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశానికి తొలి దళిత ఉపప్రధానిగా ఆయన చేసిన సేవలు, రాజకీయ జీవి తం నేటి తరాలకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- నమస్తే నెట్‌వర్క్

కేసీఆర్‌కు చిత్రపటం బహూకరణ

మాజీ సీఎం కేసీఆర్‌తో బత్తుల మధుచంద్

పాల్వంచ, ఏప్రిల్ 5: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్వీ కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల మధుచంద్ శనివారం ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూర్తి ఎంబ్రాయిడరీ వర్క్‌తో తయారు చేసిన కేసీఆర్ చిత్రపటాన్ని వనమాతో కలిసి కేసీఆర్‌కు బహూకరించారు.

గిరిజనుడి ఇంట్లో సన్నబియ్యంతో సీఎం భోజనం!

బూర్గంపహాడ్, ఏప్రిల్ 5: భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకకు ఆదివారం హాజరవుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12:35 గంటలకు సారపాకలోని ముత్యాలంపేటలోని ముత్యాలమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న బూరం శ్రీనివాసరావు అనే గిరిజనుడి ఇంటికి రానున్నారు. సహచర మంత్రులతో కలిసి ఆ గిరిజనుడి ఇంట్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని చేయనున్నారు.

నేడు భద్రాచలానికి సీఎం రేవంత్

తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పణ

సారపాకలో సన్న బియ్యంతో భోజనం ఏర్పాటు

ఖమ్మం ప్రతినిధి. నమస్తే తెలంగాణ: సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. ప్రభుత్వం తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. యన హైదరాబాద్‌లో ఉదయం 8:45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరతారు. 10 గంటలకు భద్రాచలం సమీపంలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 11 గంటలకు రాముల వారి కల్యాణోత్సవం జరిగే భద్రాచలంలోని మిథిలా స్టేడియానికి చేరుకుంటారు. 12:30 గంటల వరకు స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తారు. కల్యాణ తంతు పూర్తయిన తర్వాత సారపాక చేరుకుంటారు. ఒక సామాన్య కుటుంబంతో కలిసి వారి ఇంటి వద్ద సన్న బియ్యంతో చేసిన భోజనం భుజిస్తారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి తదితరులు కూడా రానున్నారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పర్ణశాల, ఏప్రిల్ 5: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో ఆదివారం జరుగనున్న సీతారాముల కల్యాణానికి అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. భక్తులు కల్యాణానికి ఒక రోజు ముందుగానే శనివారం ఆలయానికి చేరుకొని రామయ్యను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, కల్యాణ వేదిక వద్ద చలువ పందిళ్లు వేసి ఆలయానికి విద్యుద్దీపాలతో ఆలంకరించారు. పంచాయతీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పార్కింగ్ నుంచి కల్యాణ వేదిక వరకు చలువ పందిళ్లు, తాగునీటి కౌంటర్లతో పాటు 60 మంది పారిశుధ్య కార్మికులతో పారిశుధ్యపనులు చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు ఆధ్వర్యంలో గోదావరి తీరం వద్ద భక్తులు స్నానాలు చేసే విధంగా షవర్ బాత్‌లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, దుమ్ముగూడెం ఎంపీడీవో రామకృష్ణ, సీఐ అశోక్ కుమార్, ఆలయ అధికారి అనీల్‌కుమార్, ఇరిగేషన్ అధికారి రాజ్ సుహాస్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినికి సీవోఈలో సీటు

సాయిప్రియ

అశ్వారావుపేట, ఏప్రిల్ 5: మండలంలోని కోయ రంగాపురం గ్రామానికి చెందిన మడివి సాయి ప్రియ.. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ) ప్రవేశ పరీక్ష రాసి సీటు సాధించింది. ఈ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఆమె 6నుంచి 10వ తరగతి వరకు అనంతారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివింది. ఆమెను ఈ పాఠశాల ప్రిన్సిపాల్ సరోజని, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాంబో ప్లాంటేషన్ పరిశీలన

చండ్రుగొండ, ఏప్రిల్ 5: మండలంలోని బెండాలపాడులో బ్యాంబో ప్లాంటేషన్‌ను నీతి ఆయోగ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ దేవీప్రసాద్ శనివారం సందర్శించారు. వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. తయారీదారులతో మాట్లాడారు. డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 5: మండలంలోని మిట్టగూడెంలో గల గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రవి బండారు పల్లి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీఏ గ్రూపుల్లో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ జెండాలు ఎగురవేయాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు పట్టణంలోని అన్నివార్డుల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జెండా దిమ్మలు లేనిచోట కొత్తవి కట్టించాలని, జెండాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రేపు గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి

టేకులపల్లి, ఏప్రిల్ 5: గిరిజనులకు బకాయిపడ్డ రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ రాంచందర్ గిరిజనులకు పిలుపునిచ్చారు. శనివారం టేకులపల్లిలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ భవన్ ముట్టడికి ట్రైకార్ రుణాల లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మ్యూజియం ఏర్పాటు అభినందనీయం

భద్రాచలం, ఏప్రిల్ 5: గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఐటీడీఏ ప్రాంగణంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమని భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం వారు మ్యూజియంను సందర్శించి వివిధ గిరిజన కళాకృతులు, పెయింటింగ్ చిత్రాలు, ఇతర పనిముట్లను పరిశీలించారు. మ్యూజియం ఏర్పాటుకు ఐటీడీఏ పీవో రాహుల్, యూనిట్ అధికారుల కృషి ఎంతో ఉందని పీవోను అభినందించారు. కార్యక్రమంలో పీవో రాహుల్, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మ్యూజియం ఇంచార్జి వీరాస్వామి, అధికారులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 5: మావోయిస్టులను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఆపాలన్న ప్రధాన డిమాండుతో ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను శనివారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ధర్నాను ప్రజలంతా జయప్రదం చేయాలని కోరారు. నాయకులు సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్ రావు, సురేష్, నరేష్, ప్రణయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని వినతి

రామవరం, ఏప్రిల్ 5: రామవరం సింగరేణి కార్మిక వాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సివిల్ కార్యాలయంలో సూపర్‌వైజర్ షరీఫ్‌కు మున్సిపల్ సీపీఐ మాజీ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు శనివారం వినతిపత్రం ఇచ్చారు. కార్మిక వాడకు వారం రోజులుగా తాగునీరు అందడం లేదని చెప్పారు. తక్షణమే సింగరేణి నీటిని అందించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సూరిమేని జనార్దన్, ఈశ్వరయ్య, కుమార్, దివాకర్, ఉప్పతల శ్రీను, గంగరాజు, శంకర్ పాల్గొన్నారు.

అర్చకుని కుటుంబానికి పరామర్శ

దుమ్ముగూడెం, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన లక్ష్మీనగరం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ అర్చకుడు రాజగోపాల చార్యులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య శనివారం రాజగోపాలచార్యులు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పీవీ.కృష్ణారావు అందించిన రూ.30వేలను అర్చకుని కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉప్పాడ నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యార్థులు మంచిగా చదవాలి

బూర్గంపహాడ్, ఏప్రిల్ 5: ప్రతి విద్యార్థి మంచిగా చదివి ఊరికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించి అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎన్‌ఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముస్తాబైన నాగుల్ మీరా దర్గా

ఇల్లెందు, ఏప్రిల్ 5: శ్రీరామ నవమి, సీతారామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని సత్య నారాయణపురం హజరత్ నాగుల్ మీరా మౌలా చాంద్ దర్గా ముస్తాబైంది. స్థానిక ఆదివాసీ మహిళలు పోకల దమ్మక్క వారసులు(భద్రాద్రి రాముడికి తొలిసారిగా పూజలు అందించిన పోకల దమ్మక్క) కొందరు నవమి సందర్భంగా దర్గాలో జరిగే కల్యాణానికి గోటితో వలచిన తలంబ్రాలను దర్గాలో సమర్పిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలకు కుల మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొంటారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో స్వర్ణ పతకం

పాల్వంచ, ఏప్రిల్ 5: గత నెల 13న జాతీయ స్థాయిలో భగవద్గీత కంఠస్థ ఆన్‌లైన్ పోటీలను కర్ణాటక రాష్ట్రం మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం నిర్వహించింది. పాల్వంచకు చెందిన బండారు ఆశ, 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను వినిపించి విజేతగా నిలిచారు. స్వర్ణ పతకం సాధించారు. ఈ నెల 2న హైదరాబాద్ దిండిగల్‌లో దత్తపీఠం ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి నుంచి స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు.

నిర్మాణ కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు

పాల్వంచ, ఏప్రిల్ 5: కేటీపీఎస్ ఆరో దశ నిర్మాణ కార్మికులు.. తమను ఆర్టిజన్లుగా తీసుకోవాలన్న డిమాండుతో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. వీరి దీక్షా శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు శనివారం సందర్శించి మద్దతు తెలిపారు. వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాథం, డిష్ నాయుడు, మల్లెల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామనవమా? కాంగ్రెస్ మీటింగా?

- సీతారాముల కల్యాణం వేళ భద్రగిరిలో ఆధ్యాత్మిక శోభ కరువు
- భద్రాచలం నిండా అమాత్యులకు స్వాగతం పేరిట కాంగ్రెస్ ఫ్లెక్సీలు
- సాధారణ భక్తులకు గది దొరకాలంటే రూ.8వేలకు పైమాటే

టెంపుల్ ద్వారానికి కట్టిన ఫ్లెక్సీలు

భద్రాచలం, ఏప్రిల్ 5:జగత్కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్న వేళ కాంగ్రెస్ నాయకుల తీరు వివాదాస్పదమవుతోంది. శ్రీరామనవమి వేళ భద్రాచలం పట్టణమంతా కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలతో స్వాగత తోరణాలు దర్శనమిస్తున్నాయి. దీంతో 'ఇది శ్రీరామనవమా? కాంగ్రెస్ మీటింగా?' అంటూ భక్తులు, భద్రాచలం ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మండిపడుతున్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. చివరకు భక్తులకు స్వాగతం పలికేందుకు భద్రాద్రి దేవస్థానం ఏర్పాటుచేసుకున్న ప్రధాన స్వాగత ద్వారం వద్ద కూడా కాంగ్రెస్ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. దీంతో తిరుకల్యాణ మహోత్సవాలతో మార్మోగాల్సిన భద్రాచలంలో ప్రస్తుతం ఆధ్యాత్మిక శోభ కరువైనట్లుగా కన్పిస్తోంది.

గదుల్లేక భక్తుల ఇక్కట్లు..

భద్రాచలంలో సామాన్య భక్తుల కోసం ఈసారి ఆన్‌లైన్ విధానం పెట్టకపోవడంతో వసతి గదుల ధరలకు రెక్కలొచ్చాయి. పలు లాడ్జీలు, విడిదిగృహాల్లో ఒక్కొక్క గదికి రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు డిమాండ్ పలుకుతోంది. నిరుపేద భక్తులు మాత్రం మండుటెండలో మిథిలా స్టేడియం, గోదావరి తీరం, కరకట్ట పరిసరాల్లో చెట్ల కింద సేద తీరుతున్నారు. గత కేసీఆర్ సర్క